క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందజేస్తున్న దాత

చీపురుపల్లి: పట్టణంలోని కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయానికి గరివిడికి చెందిన స్నేహల కన్‌స్ట్రక్షన్ యజమాని ఇప్పిలి గంగాధరరావు, ఉషా దంపతులు లక్షా పదహారు వేల రూపాయలు వితరణగా బుధవారం అందజేశారు. ఆలయ నిర్మాణ ట్రస్ట్ సభ్యులకు తమ స్వగృహంలో నగదు అందించారు.

నాణ్యమైన సేవలు అందించాలి

• జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర

చీపురుపల్లి: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా రిజిస్ట్రార్ టి.ఉపేంద్ర సూచించారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు. సిబ్బందిపై ఎటువంటి ఫిర్యాదులు రాకుండా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ టీవీవీఎస్ కె.లక్ష్మణరావు, సీనియర్ అసిస్టెంట్ బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మ ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామదేవత కోటమ్మ అమ్మవారి దేవస్థానంలో బుధవారం హుండీల ఆదాయం లెక్కించారు. ఈఓ జి. శ్రీనివాస్, తనిఖీదారు ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో హుండీల ఆదాయం లెక్కించగా.. మే నెల 28వ తేదీ నుంచి ఇప్పటివరకు 6, 28, 224 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామపెద్దలు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

చుక్కవానిపాలెంలో పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ, సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలోని చుక్కవానిపాలెంలో ఈఓపీఆర్డీ లక్ష్మి నేతృత్వంలో బుధవారం పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టారు. కాలువల్లో పూడికలు తొలగించడంతో పాటు మురుగు నిల్వలను శుభ్రం చేశారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేసి రోగులను గుర్తించారు. ప్రతి 15 రోజులకోసారి తాగునీటి ట్యాంక్‌ను శుభ్రం చేయించాలని కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, కొట్టాం సీహెచ్ఓ వేణుగోపాలరావు, ఏఎన్ఎం ఎం రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించి 283 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేపట్టారు. చిల్డ్రన్ ఐ స్క్రీనింగ్ ప్రోగ్రాంలో భాగంగా విశాఖ ఐ హాస్పటల్ బృందం డాక్టర్ వంశీకృష్ణ, సాయికృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది నేత్ర పరీక్షలు నిర్వహించారు. స్క్రీన్ టెస్ట అనంతరం అవసరమైన విద్యార్థులకు కళ్లజోడు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం. ఎం.నిర్మల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



గజపతినగరం రూరల్: పాతబగ్గాం గ్రామంలో కూటమి ప్రభుత్వ మోసాలను స్థానికులకు వివరిస్తున్న నాయకులు గార తవుడు, బూడి వెంకటరావు, తదితరులు



గుర్ల: పల్లిగండ్రేడులో కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరిస్తున్న పొట్నూరు సన్యాసినాయుడు, శీర అప్పలనాయుడు, తదితరులు

బాబుది వెన్నుపోటు పాలన..

కూటమి ప్రభుత్వం చేపడుతున్న వెన్నుపోటు పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు వాడవాడలా నిర్వహిస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయిందీ వైఎస్సార్‌సీపీ నాయకులు వివరిస్తున్నారు. గరివిడి మండలంలోని తోండ్రంగిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన, తదితరులు చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తే.. నేటి కూటమి పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బొండపల్లి మండలం రయింద్రాం, కనిమెరక, గిట్టుపల్లి గ్రామాల్లో.. గజపతినగరం మండలంలో పాతబగ్గాంలో.. గంట్యాడ మండలంలో కొండతామరాపల్లి, పెదమజ్జిపాలెంలో..గుర్ల మండలంలో పల్లిగండ్రేడులో.. జామి మండలంలో వెన్నె, జన్నివలస, సోమయాజులపాలెం, శాసనాపల్లిలో గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి రూరల్: గరివిడి మండలం తోండ్రంగిలో 'చంద్రబాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



బొండపల్లి: కనిమెరకలో కరపత్రాలను పంచుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గంట్యాడ: కొండతామరపల్లిలో కూటమి ప్రభుత్వం మోసాలను వివరిస్తున్న నాయకులు నరసింహమూర్తి, జైహింద్‌కుమార్, తదితరులు



చీపురుపల్లి రూరల్: తోండ్రంగిలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు



జామి: సోమయాజులపాలెంలో బాబు మోసాలను వివరిస్తున్న పార్టీ నాయకులు జి.రవికుమార్, తదితరులు

శక్తి టీమ్‌లను ఏర్పాటు చేయాలి

• సీఐ షణ్ముఖరావు



ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఐ షణ్ముఖరావు

కొత్తవలస: మండలంలో గల ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఆడపిల్లల భద్రత నిమిత్తం శక్తి టీమ్‌లను ఏర్పాటు చేయాలని కొత్తవలస సీఐ షణ్ముఖరావు సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలో గల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లల భద్రత నిమిత్తం సెల్ఫ్ డిఫెన్స్ తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల కదలికలను ఉపాధ్యాయులు, శక్తి టీమ్స్ ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మల్లేశ్వరరావు

చీపురుపల్లి: యూత్ రెడ్‌క్రాస్‌లో చేరిన విద్యార్థులు విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. కళాశాలలో బుధవారం యూత్ రెడ్‌క్రాస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రపంచంలోనే రెడ్‌క్రాస్ సంస్థకు ఎంతో గొప్ప ప్రాముఖ్యత ఉందన్నారు. అలాంటి సంస్థలో వలంటీర్లుగా భాగస్వామ్యం కావడం గొప్ప విషయమన్నారు. రెడ్‌క్రాస్ క్యాంపెయిన్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.విజయేశ్వరరావు మాట్లాడుతూ.. ఏపీ క్లయిమేట్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు గ్రామాల్లోకి వెళ్లి వాయు, నీటి కాలుష్యంతో పాటు చెట్ల పెంపకం, తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకుడు ఎ.చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

'జిందాల్' నిర్వాసితుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ నిర్వాసితులు బొడ్డవరలో బుధవారం కూడా నిరసన కొనసాగించారు.తాము కోల్పోయిన భూముల వివరాలను ప్లకార్డులపై రాసి వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు చల్లా జగన్ మాట్లాడుతూ.. నిరసన చేస్తున్న వారంతా నిర్వాసితులు కారని కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. అందుకే ఒక్కొక్కరు ఎంతెంత భూమి నష్టపోయినదీ వివరిస్తూ నిరసన చేపడుతున్నట్లు చెప్పారు.

పంటల బీమాను వినియోగించుకోండి



కాలంరాజుపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ కిరణ్‌కుమార్

గజపతినగరం: ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటలు నాశనమైతే ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం ఆదుకుంటుందని.. రైతులందరూ తప్పనిసరిగా బీమా పథకాన్ని వినియోగించుకోవాలని ఏఓ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పిడిశీల, కాలంరాజుపేట గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 15 లోగా బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. దించి పిఎమ్ఎఫ్‌బివై బీమాకు దరఖాస్తు చేసుకోవాలని కిరన్ కుమార్ సూచించారు.

ఉద్యోగులకు సత్కారం

గుర్ల: మండలంలోని తెట్టంగి సచివాలయంతో పనిచేసిన నలుగురు ఉద్యోగులకు బదిలీ జరిగింది. వీరికి స్థానిక సచివాలయంలో సర్పంచ్ జమ్ము పార్వతి దుశ్శాలువ కప్పి బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐదేళ్లలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సచివాలయ సిబ్బంది ఎంతో కృషి చేశారన్నారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జమ్ము స్వామినాయుడు , జమ్ము లచ్చన్న , వైస్ సర్పంచ్ గురమ్మ, పంచాయతీ కార్యదర్శి గోవింద్ ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గంట్యాడ: మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఈఈ పి.త్రినాథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రామవరం ఫీడర్ పరిధిలోని బుడతానపల్లి, చినమానపురం, తదితర గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెట్ల కొమ్మల తొలగింపు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి పోరలి వరకు గల విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలను గురువారం తొలగించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఆదిత్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా గజపతినగరం ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహంపై దాడి

గుర్ల: మండలంలోని తాటిపూడిలో ఎన్టీఆర్ విగ్రహంపై బుధవారం కొంతమంది దాడి చేశారు. దీంతో విగ్రహం ముక్కు విరిగిపోవడంతో స్థానిక టీడీపీ నాయకులు గుర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల కిందట ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఈ విగ్రహన్ని అవిష్కరించారు. ఇదిలా ఉంటే విగ్రహంపై దాడి చేసినట్లు అనుమానిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. దాడి చేసిన యువకుడు కూడా టీడీపీ కార్యకర్తేనని స్థానికులు చెబుతున్నారు.

బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న పీఏసీఎస్ అధ్యక్షురాలు వంగపండు అలివేణి

దత్తిరాజేరు: మండలంలోని పీఏసీఎస్ అధ్యక్షురాలిగా వంగపండు అలివేణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, రైతులందరికీ మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మరో ఇద్దరు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కొండపల్లి కొండలరావు, పీఏసీఎస్ సీఈఓ బలరామ్, తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన బోరు



లక్కవరపుకోట: మండలంలోని గేదెలవానిపాలెం పంచాయతీ శివారు గ్రామం వేచలపువానిపాలెం గ్రామంలో విశాఖ డెయిరీ పాలకేంద్రం సమీపంలో గల బోరు మూలకు చేరింది. ఈ బోరు నీటినే గ్రామస్తులు ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే బోరు పాడవ్వడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరును వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి



వీఆర్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ నిర్మలా జ్యోతి

• వ్యవసాయశాఖ ఏడీఏ నిర్మలాజ్యోతి

గజపతినగరం:

కౌలు రైతులందరూ తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు పొందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ ఎ. నిర్మలాజ్యోతి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి. రత్నకుమార్ ఆధ్వర్యంలో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కౌలు రైతులు ఎంతమంది ఉన్నారు..వారు సాగు చేస్తున్న భూమి ఎంత..ఏయే పంటలు సాగు చేస్తున్నారో తెలుసుకుని నివేదికలు సిద్ధం చేయాలన్నారు. కౌలురైతులు గుర్తింపు కార్డులు పొందితే ప్రతికూల పరిస్థితుల్లో పంట పోతే ఆర్థిక ప్రయోజనం లభిస్తుందని చెప్పారు.

యూరియా నిల్వల పరిశీలన



గరివిడిలో యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి, తదితరులు



చీపురుపల్లి: ఎరువులు దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దార్ ధర్మరాజు, తదితరులు

చీపురుపల్లి రూరల్ (గరివిడి):

గరివిడి మండలంలోని బొండపల్లి పీఏసీఎస్‌ను (ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం) జిల్లా వ్యవసాయాధికారి వీటీ.రామారావు, ఏడీఏ కోటేశ్వరరావు, ఏఓ పి. ప్రసాదరావు, తదితరులు బుధవారం తనిఖీ చేసి ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం నిల్వలు ఉన్నదీ, లేనిదీ పరిశీలించారు. ఎంఆర్‌పీకే ఎరువులు విక్రయించాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన రైతులకు వెంటనే యూరియా అందించాలన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు..

చీపురుపల్లి: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ డి.ధర్మరాజు ఆదేశించారు. పట్టణంలోని ఎరువుల దకాణాలను పరిశీలించి, స్టాకు వివరాలపై ఆరా తీశారు. ఎరువులను కృత్రిమ కొరత సృష్టించినా.. అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అన్నపూర్ణ, ఏఓ రామ్‌ప్రసాద్

లైసెన్స్‌లు రద్దు చేస్తాం..

కొత్తవలస: ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే షాపుల లైసెన్స్‌లను రద్దు చేస్తామని మండల ప్రత్యేకాధికారి, సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం. అన్నపూర్ణ హెచ్చరించారు. మండల పరిధిలో గల పలు ఎరువుల దుకాణాలను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు.